



విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌దేవ్ సింగ్

జిల్లాలో తగ్గిన నేరాలు

ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి జిల్లాలో 2022 సంవత్సరంలో నేరాలు గణనీయంగా తగ్గాయని ఎస్పీ రాహుల్ దేవ్ సింగ్ తెలిపారు. శనివారం నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన నేరాలు, నియంత్రణ తదితర వాటి వివరాలను మీడియాకు వెల్లడించారు. 2022లో పోలీసుల పనితీరు ప్రశంసనీయంగా ఉందన్నారు. అరాచక శక్తులపై ఉక్కు పాదం మోపారని తెలిపారు. పటిష్టమైన రోడ్డు భద్రత చర్యలు చేపడుతూ ప్రమాదాల నివారణకు గణనీయంగా కషి చేశామన్నారు. హత్యలు, అత్యాచారాలు గత ఏడాది కంటే తగ్గాయన్నారు. ఫోక్స్ కేసులు, ఎస్సీ, ఎస్టీలపై నేరాలు తగ్గాయని ప్రజలకు జవాబుదారీగా ఉంటున్నామన్నారు. ప్రజలు పోగొట్టుకున్న సొత్తులో 2,350 కోట్లు జిల్లాలో రికవరీ చేశామన్నారు. అక్రమ మద్యం తయారీతో పాటు విక్రయిస్తున్న నలుగురిపై పీడీ యాక్ట్ నమోదు చేశామని వారిలో ఇద్దరిని జిల్లా బహిష్కరణకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపామన్నారు. మహిళా పోలీసుల ద్వారా మహిళల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. సైబర్ నేరాలపై ప్రత్యేక దష్టి పెట్టమన్నారు. జిల్లా ఇప్పటివరకు లాక్అదాలత్‌లో 4277 కేసులు పరిష్కరించామన్నారు. అక్రమ మద్యం, ఇతర నేరాలపై పట్టుకున్న 1599 వాహనాల వేలంలో 4.70 కోట్లు ఆదాయం ప్రభుత్వానికి వచ్చిందన్నారు. డయల్ 100కు 2022లో 6286 కాల్స్ వచ్చాయన్నారు. కొత్త జిల్లాలో అతి తక్కువ సమయంలోనే స్థానికంగా పరేడ్ సిద్ధం చేశామన్నారు.

నూతన సంవత్సరం పేరుతో చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు

నూతన సంవత్సరం పేరుతో మద్యం తాగి అల్లరి చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దుకాణాలను హోటళ్లను నిర్ణీత సమయానికి మూసివేయాలన్నారు. ప్రశాంతి నిలయం చుట్టూ ఎలాంటి హంగామా చేయరాదని నిషేధం విధించమన్నారు. బైకులలో హంగామా చేయరాదని, రహదారులను కేకులు కట్ చేయరాదని సూచించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పి రామకష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు : కలెక్టర్

పుట్టపర్తి అర్బన్ : జిల్లాలో ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని కలెక్టర్ బసంత్ కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్ నుంచి ప్రకటన విడుదల చేశారు. జిల్లా ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఏడాదిలో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆదివారం కలెక్టరేట్‌లో తనతో పాటు జాయింట్ కలెక్టర్ ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు అందుబాటులో ఉంటామన్నారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చేవారు, బొకేలు స్వీట్ బాక్స్‌లు, కేకులు తీసుకురావద్దన్నారు. గులాబీ పువ్వు, లేదా ఒక మొక్క మాత్రమే ఇవ్వాలన్నారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కోసం విరాళాలు అందించాలని కోరారు. కరోనా తిరిగి పంజా విసురుతోందని ప్రజలందరూ కోవిడ్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ఆరోగ్యాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

కోటి ఆశలతో..2023 సరికొత్త స్వాగతం..2

◆ బై బై 2022...
వెల్‌కమ్ 2023..!

◆ పెద్దగా కలసిరాని 2022

◆ కొంగొత్త ఆశలతో కొత్త ఏడాదిలోకి..

కాలగమనంలో మరో సంవత్సరం కలిసిపోయింది. 'కొత్త'ఆశలు మొలకెత్తాయి... ఆకాంక్షలు ఊగిసలాడాయి... వ్యాపకాలు దారి మార్చుకున్నాయి. సాధ్యాసాధ్యాలను పక్కనపెడితే మనసు కొత్త ఉత్సాహంతో సందడి చేసింది. కొత్త కాంతులు, కోటి ఆశలతో 'న్యూ'తనోత్సాహం నెలకొంది. 2022కు వీడ్కోలు చెప్పి 2023కు స్వాగతం పలుకుతూ అందరిలోనూ జోష్ కన్పించింది. గతేడాది కష్టాలను ఓ జ్ఞాపకంగా వదిలేసి... ఆశల అడుగులు ఆగకుండా గుండెనిండుగా 2023కు జిల్లా వాసులు స్వాగతం పలికారు.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

2022 సంవత్సరంలోని చేదు, తీపి జ్ఞాపకాలకు వీడ్కోలు పలుకుతూ కొంగొత్త ఆశలతోనూ ఆశయాలతో 2023కు స్వాగతం పలికారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే కార్యక్రమాలు శనివారం రోజు ఉత్సహపూరితంగా జరిగాయి. అర్ధరాత్రి 12 గంటలకు కొత్త సంత్సరానికి స్వాగతం పలికేందుకు పెద్దఎత్తున కేకులు, మిఠాలను కొనుగోళ్లతో శనివారం మధ్యాహ్నం నుంచి నగరాలు, పట్టణాల్లో సందడి నెలకొంది. సాయంత్రం నుంచి స్నేహితులు, సన్నిహితులు వారికి అనువైన ప్రాంతాల్లో వీడ్కోలు సంబరాలు జరుపుకున్నారు. అర్ధరాత్రి 12 గంటలకు కేకులు కట్ చేసి కొత్త ఏడాది స్వాగతం పలికే కార్యక్రమాలు జోరుగా సాగాయి.

పెద్దగా కలసిరాని 2022

నిన్నటితో ముగిసిన 2022 సంవత్సరం పెద్దగా కలసిరాలేదనే చెప్పాలి. 2021 తరహాలో కోవిడ్ 2022 పెద్దగా ఇబ్బంది పెట్టకపోవడం సంతోషించదగ్గ అంశంగా చెప్పుకోవచ్చు. అనేక ఆంక్షల నడుమనే 2022 సంవత్సర వేడుకలు జరిగాయి. కాని ఆ తరువాత కోవిడ్ ప్రారంభం తగ్గింది. అంతక మునుపు కోవిడ్ సమయంలో విధించిన లాక్‌డౌన్‌ల కారణంగా మొదలైన ఆర్థిక కష్టాలు సామాన్యులను ఈ ఏడాది వెంటాడాయి. దీంతో అనేక మంది చిరు వ్యాపారులు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఆ బాధలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రపంచాన్ని చుట్టుముట్టిన ఆర్థిక సంక్షోభం ప్రారంభం ఇప్పటికీ కొనసాగుతూనే ఉందని ఆర్థిక నిపుణులు సైతం చెబుతున్నారు. ఈ ప్రభావాలు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. కొత్త సంవత్సరంలోనైనా ఆర్థిక ఇబ్బందులు తొలగి తిరిగి సామాన్యుడి జీవనం పట్టాలెక్కుతుందన్న ఆశాభావం అందరిలోనూ ఉంది.

అధిక వర్షాలతో రైతుకు తీరని నష్టం

ఈ ఏడాది ప్రకృతి తోడ్పాటు అందించినట్టు కనిపించింది. వర్షాలు బాగాపడినప్పటికీ అధిక వర్షాలతో రైతులకు తీరని నష్టమే మిగిలింది. వర్షం కోసం ఎప్పుడూ ఆకాశం వైపు ఎదురు చూసే జిల్లా రైతాంగానికి 2022లో అధిక వర్షాలతో ఇబ్బందులు పడ్డారు. అనంతపురం జిల్లా సాధారణ వర్షపాతం 459 అయితే ఈ ఏడాది 647 మిల్లీమీటర్లు నమోదయ్యింది. సత్యసాయి జిల్లా సాధారణ వర్షపాతం 527 మిల్లీమీటర్లు అయితే పడిన వర్షపాతం 789 మిల్లీమీటర్లు రెండు జిల్లాలోనూ సాధారణం కంటే 40 శాతం అధికంగా వర్షాలు పడ్డాయి. ఈ వర్షాలతో గతంలో ఎన్నడూలేని విధంగా అన్ని ప్రాజెక్టులు పొంగి ప్రవహించాయి. సుమారు వంద టిఎంసిల వరకు నీరు జిల్లా నుంచి వరద రూపంలో దిగువకు పోయింది. ఎప్పుడూ ప్రాజెక్టుల్లో నీళ్ల కోసం ఎదురుచూసేవాళ్లు. ఈసారి మాత్రం పెన్నా, చిత్రావతి నదులు సైతం పొంగి ప్రవహించాయి. ఈ అధిక వర్షాలతో వేరుశనగ, పత్తి, మిరప పంటల రైతులు తీవ్రంగా నష్టపోయారు.



రాజకీయ వేడి

2022 రాజకీయ వాతావరణం వాడీవేడిగానే సాగాయి. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధాలు సాగాయి. టిడిపి, వైసిపి నేతల మధ్య మాటల యుద్ధాలు సాగాయి. తాడిపత్రి, రాప్తాడు, రాయదుర్గం, కళ్యాణదుర్గంల్లో ఇవి తారా స్థాయిలో నడిచాయి. హిందూపురంలో రామకృష్ణారెడ్డి హత్య వైసిపిలో గ్రూపు తగాదాలను బయటపెట్టాయి. ఎమ్మెల్సీ ఇక్బాల్‌పైనే ఆరోపణలు వెల్లువెత్తాయి. హిందూపురం పార్లమెంటు సభ్యులు గోరంట్ల మాధవ్ అశ్లీల వీడియోలు రాష్ట్ర స్థాయిలో దుమారం రేపాయి. ఈ అంశంపై రాష్ట్ర స్థాయిలోనే అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధంత రాజకీయ వాతావరణం వేడెక్కింది.

తగ్గిన నేరాలు

రెండు జిల్లాల పరిధిలో నేరాల సంఖ్య ఈఏడాది తగ్గినట్టు ఎస్పీలు డాక్టర్ కె.ఫక్కీరప్ప, రాహుల్‌దేవ్ సింగ్‌లు తెలిపారు. నేరాల సంఖ్య తగ్గినప్పటికీ మహిళలపై హింస శాతం మాత్రం తగ్గలేదు. మరింత పెరిగింది. అదే సమయంలో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరగడం గమనార్హం. రహదారి ప్రమాదాలు తగ్గాయి. ముఠా కక్షలు కూడా ఈ సంవత్సరం చోటు చేసుకోకుండా పోలీసు శాఖ గట్టి చర్యలు చేపట్టింది.

రెండు జిల్లాల ఏర్పాటు

రాష్ట్ర ప్రభుత్వం 2022వ సంవత్సరంలో జిల్లాల విభజన చేపట్టింది. దీంతో ఉమ్మడి అనంతపురం జిల్లా రెండుగా ఏర్పాటైంది. అనంతపురం జిల్లాగా 31 మండలాలతో ఏర్పాటవగా, సత్యసాయి జిల్లా 32 మండలాలతో ఏర్పాటైంది. మార్చి నెల నుంచి ఈ విభజన జరిగి ఆయా ప్రాంతాల నుంచి కార్యకలాపాలు మొదలయ్యాయి. కొత్త జిల్లా ఏర్పాటైనప్పటికీ ఇప్పటికీ అనేక బలారిష్టాలు మాత్రం కొత్త జిల్లాకు తొలగలేదు. పూర్తి స్థాయి కార్యాలయాల ఏర్పాట్లు పూర్తవలేదు. ఉన్న అరకొర సౌకర్యాలతోనే అక్కడి కార్యకలాపాలు కొనసాగుతున్నాయి.

పకడ్బందీగా ఓటర్ల జాబితా సవరణ

జిల్లా ఎలక్టరోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

జిల్లాలో 2023 ఓటరు జాబితా సవరణ పగడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎలక్టరోల్ అబ్జర్వర్ డి.మురళీధర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని గుట్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పెనుకొండ సబ్ కలెక్టర్ కె.కార్తీక్‌తో కలిసి జిల్లా ఎన్నికల ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంపై క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుట్టూరు గ్రామంలోని మూడు పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన ఓటరు నమోదు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం జిల్లా ఎలక్టరోల్ అబ్జర్వర్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఎలాంటి పొరపాట్లకు అవకాశం లేకుండా ఓటరు జాబితా సవరణ జరగాలని సూచించారు. చనిపోయిన ఓటర్ల పేర్లు తప్ప ఎలాంటి పేర్లను నేరుగా జాబితా నుంచి తొలగించకూడదని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన అనంతరం తుది జాబితాను సిద్ధం చేయాలన్నారు. అనంతరం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు టాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ స్పందన తహశీల్దార్ గోపాలకష్ణ, పెనుకొండ తహశీల్దార్ స్వర్ణలత, జెడ్పీటీసీ శ్రీరాములు, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు గోవిందరావు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వ్యకాసం నాయకులు

రస్తా సమస్యపై వ్యకాసం ధర్నా

ప్రజాశక్తి -పెనుకొండ, రొద్దం

రొద్దం మండలం చెరుకూరు గ్రామంలో నెలకొన్న రస్తా వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ వ్యకాసం ఆధ్వర్యంలో శనివారం నాడు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద శనివారం నాడు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు హరి, వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ చెరుకూరు గ్రామానికి సంబంధించిన నందమూరి కాలనీవాసులు అనుభవంలో ఉన్న రస్తాను జెసిబి యంత్రంతో ఓ వ్యక్తి తొలగించి వరి నాట్లు వేస్తున్నాడని తెలిపారు. రస్తాను తొలగిస్తున్న తలారి శీనప్ప, అనితమ్మపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ఐదు రోజుల నుండి వివాదం నడుస్తున్నా సంబంధిత తహశీల్దార్ చర్యలు తీసుకోలేదన్నారు. సబ్ కలెక్టర్ విచారించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం వినతిపత్రాన్ని సబ్‌కలెక్టర్ కె.కార్తీక్‌కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, సోమందేపల్లి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంగప్ప, కాలనీవాసులు మల్లికార్జున, అంజన్నప్ప, కిష్టప్ప, సిద్ధమ్మ, జయమ్మ, శాంతమ్మ, అలివేలమ్మ, హనుమక్క పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ పరిశీలన

రొద్దం : రస్తా వివాదాన్ని పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చెరుకూరు కాలనీవాసులు శనివారం నాడు పెనుకొండ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చెపట్టారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ కార్తీక్ వెంటనే మండల అధికారులతో కలిసి గ్రామానికి వెళ్లారు. దారి సమస్యకు సంబంధించిన వివరాలను గ్రామస్తులు, అధికారులతో అడిగి తెలుసుకున్నారు. రోడ్డు పట్టా భూమిలో ఉందని తెలపడంతో సబ్ కలెక్టర్ రైతు, కాలనీవాసులతో మాట్లాడారు. రస్తా వివాదాన్ని శాంతియుతంగా పరిష్కరించుకునేలా అందరూ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనంతాచారి, సర్వేయర్ మైనుద్దీన్, ఆర్ఐ షాషావలి, విఆర్ఒ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, రైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.



రస్తా మ్యాప్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

యుటిఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండ డివిజన్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో డైరీ, జీవోల సంపుటి, క్యాలెండర్‌ను డివైఇఒ రంగస్వామి, ఎంఇఒ ఆంజనేయులు నాయక్, హెచ్ఎం నారాయణ రెడ్డిల చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఎం.సుధాకర్ మాట్లాడుతూ గత 45 సంవత్సరాలుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో డైరీ, ఉపాధ్యాయులకు ఉపయోగపడే జీవోల సంపుటిని ముద్రిస్తున్నట్లు చెప్పారు. విద్యారంగ సమస్యల పరిష్కారంతో పాటు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం యుటిఎఫ్ పోరాటం సాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నారాయణ స్వామి, నాయకులు రమేష్, నరేష్, నబిరసూల్, కష్ణా నాయక్, సోమశేఖర్, అశ్వర్థ, సత్యమయ్య, ఓబిలేసు, శ్రీనివాసులు, రామకష్ణ నాయక్, ఆది జినేష్, నరేష్, షణ్ముఖ, తిప్పేస్వామి, రవీంద్రనాథ్, నాగేంద్ర, రామాంజినేయులు పాల్గొన్నారు.

టిడిపి కార్యాలయానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలో టిడిపి కార్యాలయానికి అవసరమైన స్థలం కేటాయించాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం టిడిపి కార్యాలయంలో నాయకులతో పాటు తెలుగు యువత నాయకులు సమావేశమై చర్చించారు. వైసిపి కార్యాలయానికి ఎకరా స్థలాన్ని రెవెన్యూ అధికారులు కేటాయించారని, 40 ఏళ్లు గా ఉన్న టిడిపికి కూడా అనువైన ప్రాంతంలో స్థలాన్ని కేటాయించాలని కోరారు. త్వరలోనే పార్టీ నాయకులందరూ కలెక్టర్‌ను కలిసి స్థలాన్ని కేటాయించాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తెలుగు యువత నాయకులు వంశీ కిషోర్, సాయికుమార్, నాగరాజు, మురళి, శంకర్, మాల యశ్వంత్ పాల్గొన్నారు.

నీటి సమస్యను పరిష్కరించండి

రహమత్‌పురం మహిళల వేడుకోలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘంలోని రహమత్‌పురం ప్రాంతంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, సమస్యను పరిష్కరించాలని ఆ ప్రాంత మహిళలు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ముందు వాపోయారు. శనివారం ఛైర్‌పర్సన్ ఛాంబర్‌లో ఆమెను కలిసి సమస్యను వివరించారు. గత 15 రోజులుగా నీళ్లు రావాడం లేదని, అడిగితే ఆ ప్రాంతానికి చెందిన వాటర్ మ్యాన్ ఇష్టం వచ్చిన చోట చెప్పుకోవాలని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారన్నారు. సమస్యను పరిష్కరించే వరకు తాము ఇక్కడి నుంచి కదలమని చెప్పారు. ఇదే విషయంపై 15వ వార్డు కౌన్సిలర్ షాజియా రహమత్‌పురం ప్రాంతంలో పైప్ లైన్‌లు ఏర్పాటు చేయాలని లిఖిత పూర్వకంగా కోరారు. దీనిపై స్పందించిన ఛైర్‌పర్సన్ వెంటనే ట్యాంకర్లను ఏర్పాటు చేసి నీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు.



తాగునీటి సమస్యపై ఛైర్‌పర్సన్ వద్ద మాట్లాడుతున్న మహిళలు

మున్సిపల్ సమావేశంలో రచ్చ..!

కౌన్సిలర్లే సమావేశంలో ఉండాలని నిర్ణయం - బయటకు వెళ్లిన సభ్యుల కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి-మడకశిర

మడకశిర నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశం సభ్యుల వాదనలు, ప్రతివాదనల నడుమ వాడీవేడిగా కొనసాగింది. గెలుపొందిన కౌన్సిలర్లే సమావేశంలో పాల్గొనాలని అధికారులు పేర్కొన్నారు. దీనిపై పెద్ద ఎత్తున వాదనలు జరిగాయి. ప్రభుత్వ జీవో మేరకు దీనిని తప్పని సరిగా అమలు చేయాల్సిందేనని కమిషనర్ చెప్పడంతో ప్రజాప్రతినిధుల స్థానంలో వచ్చిన వారి కుటుంబ సభ్యులు బయటకు వెళ్లారు. ఇలా మడకశిర మున్సిపల్ పాలక వర్గం అసలైన కౌన్సిలర్లతో తొలిసారి సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో అధికారులు ముందుగా అజెండాల్లో పేర్కొన్న వివరాలు వెల్లడించే ప్రయత్నం చేశారు. ఈ లోపుగానే ప్రతిపక్ష టిడిపికి చెందిన ఐదు మంది కౌన్సిలర్లు పాలకవర్గం, అధికారులపై ఏకధాటిగా ప్రశ్నల వర్షం కురిపించారు. వీరు మాట్లాడుతుండగానే అధికార పార్టీకి చెందిన పలువురు కౌన్సిలర్లు సైతం అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమయంలో నగర పంచాయతీ వైస్ ఛైర్మన్ రామచంద్ర రెడ్డి జోక్యం చేసుకుని సమస్యలను కౌన్సిల్ సభ్యులే మాత్రమే వివరించాలని, ఇతరులకు సమావేశంలో మాట్లాడే హక్కు ఉండదని పేర్కొన్నారు. దీనిపై మహిళా సభ్యులు స్పందిస్తూ తమకు రాజకీయ, వార్డుల అభివృద్ధిపై అవగాహన తక్కువగా లేని నేపథ్యంలో తమ భర్తల సహకారంతో సమావేశాలకు హాజరవుతున్నామని చెప్పారు. తాము పదవులు చేపట్టి రెండు సంవత్సరాలు అవుతోందని అప్పట్లో ఇలాంటి నిబంధనలు లేవని, ఇప్పుడు మాత్రమే ఎందుకు అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ కాగా ఆమె తనయుడు ఇంత వరకు కౌన్సిల్‌కు ప్రాతినిధ్యం వహించారని, అప్పుడు అధికారులు ఎందుకు ఆయన్ను నిలువరించలేదన్నారు. ఈ విషయంపై కమిషనర్ ప్రభాకర్‌రావు జోక్యం చేసుకుని ప్రభుత్వం కొత్తగా జీవోను విడుదల చేసిందని, ఆ మేరకు ప్రస్తుతం దీనిని అమలు చేస్తున్నట్లు వివరణ ఇచ్చారు. నిబంధనలు అమలు చేస్తామని చెప్పడంతో కౌన్సిలర్ల స్థానంలో సమావేశానికి వచ్చిన వారి కుటుంబ సభ్యులు సమావేశం మందిరం నుంచి బయటకు వెళ్లిపోయారు. భవిష్యత్తులో జరిగే సమావేశాల్లో కూడా ఛైర్‌పర్సన్ స్థానంలో లక్ష్మీనరసమ్మ మాత్రమే ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ హిందూపురం రోడ్డులో అనుమతులు లేకుండా అనధికారికంగా అనుమతులు లేకుండా వెలసిన ప్రయివేటు పాల శీతలీకరణ కేంద్రంపై అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని నిలదీశారు. నగర పంచాయతీలో నిబంధనల సాకుతో నూతనంగా నిర్మించే ఇళ్ల నిర్మాణాలకు ఎందుకు అడ్డుపడుతున్నారని ప్రశ్నించారు. వడ్రపాలెం గ్రామంలో తాగునీటి ఎద్దడి తీవ్రవంగా ఉందని దీనిని పరిష్కరించాలని పలుసార్లు అధికారుల దష్టికి తీసుకొచ్చిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో కౌన్సిలర్లుగా తాము గెలిచినా వార్డుల్లో ఉత్సవ విగ్రహాల్లా మిగిలిపోతున్నామని పేర్కొన్నారు. కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి దాదాపు మూడు నెలలు కావస్తున్న ఇప్పటి వరకు ఒక్క వార్డులో కూడా పర్యటించలేదని, ఇలా ఉంటే సమస్యలు ఎలా తెలుస్తాయన్నారు. ఇలా అధికారులపై సభ్యులపై ఆరోపణలు, ప్రత్యారోపణల నడుమే సమావేశాన్ని ముగించేశారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ వెంకటలక్ష్మమ్మ, రామచంద్ర రెడ్డి, కోఆప్షన్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సమస్యలపై అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు

విమర్శలు మాని అభివృద్ధి చేసి చూపండి : టిడిపి

ప్రజాశక్తి-కనగానపల్లి

ప్రజలకు ఎవరి పాలనలో న్యాయం జరిగిందో అందరికీ తెలుసునని, వైసిపి నాయకులు పరిటాల కుటుంబంపై విమర్శలు మాని అభివద్ధిపై దృష్టి సాధించాలని టిడిపి నాయకులు హితవు పలికారు. శనివారం మండల కేంద్రంలోని పరిటాల భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ యాతం పోతలయ్య, పూజారి నాగభూషణం, లక్ష్మీనారాయణ, చల్లా బాలకష్ణ మాట్లాడుతూ ఇటీవల రాప్తాడు నియోజకవర్గం వ్యాప్తంగా టిడిపికి ప్రజల నుంచి వస్తున్న స్పందన చూసి వైసీపీ నాయకులు ఓర్వలేకున్నారన్నారు. పరిటాల శ్రీరామ్ నాయకత్వంపై ప్రజల్లో అభిమానం పెరుగుతోందన్నారు. మాజీ మంత్రి పరిటాల సునీత తెచ్చిన నిధులను ఉపయోగించి రిజర్వాయర్ పనులు ఎందుకు చేపట్టలేక పోతున్నారని ప్రశ్నించారు. నిధులు తెప్పించే సత్తా ప్రస్తుత రాప్తాడు ఎమ్మెల్యేకు లేదన్నారు. టిడిపి హయాంలోనే రాప్తాడులో అభివృద్ధి జరిగిందన్నారు. వైసిపి నాయకులు టిడిపి నేతలపై విమర్శలు మాని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తే బాగుంటుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కాసుమూర్తి వెంకటేష్, ఎంపిటిసి బిల్లే భాస్కర్, నాయకులు సుధాకర్ చౌదరి, బాల నరసింహ యాదవ్, బట్టా సురేష్ చౌదరి, బంగి మల్లేష్, భానుగొట ఆంజనేయులు, పోతలయ్య, రాములమ్మ, దేవరాజు, సుధాకర్, శేఖర్, సూరి పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ట్యాబ్‌ల పంపిణీ

తలుపుల : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మండల విద్యాధికారి వెంకట్రాముడు, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు చేతుల మీదుగా ట్యాబ్‌లను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ విద్యావిధానంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారన్నారు. అందులో భాగంగానే ట్యాబ్‌లను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్యలో 'స్పోర్ట్స్ డే' వేడుకలు

గోరంట్ల: పట్టణంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో స్పోర్ట్స్ డే వేడుకలను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏజీఎం సుబ్బారెడ్డి, ఎస్ఐ ఇక్బాల్ బాషా, హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. ఆటలు మంచి ఆరోగ్యం, దేహదారుఢ్యానికి దోహదం చేస్తాయన్నారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఇషాద్, అకాడమిక్ కోఆర్డినేటర్ తిరుమలేష్ రెడ్డి, డీన్ గంగాధర, ఎఒ నాగరాజు, ప్రైమరీ, ప్రీప్రైమరీ ఇన్‌ఛార్జిలు అనిత, సుమయభాను పాల్గొన్నారు.

324 పింఛన్లు మంజూరు

మడకశిర : మడకశిర మండలంలో కొత్తగా 324 పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో నరసింహామూర్తి తెలియజేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలలో నివాసం ఉన్న వద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పింఛన్లు వచ్చాయన్నారు. గ్రామాల్లో 18 సచివాలయాల పరిధిలో 253, నగర పంచాయతీ పరిధిలోని 6 సచివాలయాల పరిధిలో 71 కొత్త పింఛన్లు మంజూరు అయ్యాయన్నారు.

ద్విచక్ర వాహనాల వేలంపాట

తలుపుల: మండల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ నందు సెబ్ సిఐ రామ్మోహన్, స్థానిక ఎస్ఐ మక్బుల్‌బాషా ఆధ్వర్యంలో బహిరంగ వేలం వేశారు. మొత్తం 11 ద్విచక్ర వాహనాలు, ఆటో, కారుకు బహిరంగంగా వేలంపాట నిర్వహించారు. వేలంపాట ద్వారా రూ.2,43,965 నగదు వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

పాదయాత్ర చేస్తున్న అభిమానికి స్వాగతం

బత్తలపల్లి : రాష్ట్రంలోని ఎమ్మెల్యేలు అందరూ ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డిని ఆదర్శంగా తీసుకుని తిరిగి వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకురావాలని విజయనగరం నుంచి ధర్మవరంకు పాదయాత్ర చేస్తున్న అభిమానికి బత్తలపల్లి మండల వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ బగ్గిరి బయ్యపరెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. విజయనగరం జిల్లా రాజాం మండలంకు చెందిన వందాన శేఖర్ విజయనగరం నుంచి ధర్మవరం వరకు పాదయాత్ర చేస్తూ శనివారం మండలానికి చేరుకున్నారు. ఆయనకు స్థానిక వైసిపి నాయకులు పూలమాలలతో స్వాగతం పలికారు. బత్తలపల్లి శివాలయం వద్ద కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని ధర్మవరం వెళ్లారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ ఈడిగ కాకప్ప, వైఎస్సార్సీపీ విద్యార్థి విభాగం నాయకులు నరేంద్రరెడ్డి, సర్పంచు అక్కిందామోదర్, ఉప సర్పంచి బండి నాగభూషణ, నాయకులు సంద్రా రామకష్ణ, కుమ్మర వెంకటరమణ, టైగర్ బాబా. కమతం ఆంజనేయులు, ముసలప్ప, వ్యాపారం పెద్దప్ప, లింగమయ్య, నారాయణ పాల్గొన్నారు.

కందిలో పంటకోత ప్రయోగాలు

బత్తలపల్లి : మండలంలోని ఈదుల ముష్టూరు, దంపెట్ల, డి.చెర్లోపల్లి గ్రామాల్లో డాక్టర్ వైఎస్సార్ క్రాప్ ఇన్సూరెన్స్ పథకం కింద కందిలో పంటకోత ప్రయోగాలను వ్యవసాయ అధికారులు శనివారం నిర్వహించారు. ఏఓ ఓబిరెడ్డి, వీహెచ్చీ సత్యనారాయణ, ఎంపీఈవో సోమశేఖర్, వీఏఏ నాగార్జునల పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలను నిర్వహించినట్లు ఏఎస్వో డాక్టర్ లక్ష్మీనరసింహాశర్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో దంపెట్ల సర్పంచి చల్లా కరుణాకర్‌నాయుడు, ఎస్బీఐ ఇన్సూరెన్స్ అధికారులు రఫీ పాల్గొన్నారు.

హద్దుమీరితే చర్యలు : ఎస్ఐ

బత్తలపల్లి : నూతన సంవత్సర, సంక్రాంతి వేడుకల్లో హద్దు మీరి ప్రవర్తించే వారిపై చర్యలు తప్పవని ఎస్ఐ టివి.శ్రీహర్ష హెచ్చరించారు. శనివారం బత్తలపల్లి పోలీస్ స్టేషన్లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ బత్తలపల్లి పరిధిలో ఎలాంటి సంఘటనలకూ తావులేకుండా నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలన్నారు. నిబంధనల మేరకు మద్యం షాపులు, హోటళ్లు, దుకాణాలు, వ్యాపార సంస్థలు, నిర్ణీత సమయాల్లోనే ఖచ్చితంగా మూసివేయాలన్నారు. రహదారులపై కేక్ కటింగ్లు చేయడం నిషేధమన్నారు. మద్యంకు అనుమతి లేని ప్రదేశాల్లో మత్తు పానీయాలు సేవించినా, అందుకు ఏర్పాట్లు సమకూర్చినా చట్టపరంగా చర్యలు తప్పవన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

లేపాక్షి : మండల పరిధిలోని మైదుగోళం గ్రామ శివారులో ప్రభుత్వ రేషన్ బియాన్ని తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. అందులో ఉన్న 40 బియ్యం ప్యాకెట్‌లను స్వాధీనం చేసుకుని, వాటిని తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఇన్‌ఛార్జి ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాహనాలకు వేలంపాట

రొద్దం : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను పెనుకొండ డీఎస్పీ హుస్సేన్‌పీరా, సెబ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్, సెబ్ సిఐ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నాడు రొద్దం పోలీసు స్టేషన్‌లో వేలం పాట నిర్వహించారు. 42 ద్విచక్ర వాహనాలు, 2 ఆటోలు, 3 కార్లకు వేలం నిర్వహించగా మొత్తం రూ.8,41,340 ప్రభుత్వంకు ఆదాయం వచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

గడపదాటని చేతలు..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాటలు కోటలు దాటుతున్నాయి...చేతలు గడపదాటం లేదు.' అన్న విధంగా ఉంది ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల తీరు. సంక్షేమానికి పెద్దపీట వేశామని పాలకులు ఒకవైపు మాటలు చెబుతున్నారు. ఆచరణలో మాత్రం అవి ఏ మేరకు అమలు జరుగుతున్నాయన్నది ప్రశ్నార్థకంగా ఉంది. ఇళ్ల నిర్మాణాల పనితీరు చూస్తే ఇది స్పష్టమవుతోంది. వైసిపి అధికారంలోకి వచ్చిన మూడున్నరేళ్లలో మంజూరైన ఇళ్లు, నిర్మించిన ఇళ్లు చూస్తే ఇది అర్థమవుతుంది. 68 వేల ఇళ్లు అనంతపురం జిల్లా వరకు మంజూరు చేశారు. ఇందులో నిర్మించిన ఇళ్లు చూస్తే కేవలం ఆరు వేలు మాత్రమే పూర్తయ్యాయి. తక్కిన ఇళ్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. 10 వేల ఇళ్లు అసలు ప్రారంభానికే నోచుకోలేదు. మొత్తం ఇళ్ల నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఈ ఇళ్ల నిర్మాణాల్లో లోపాలపై సిపిఎం సమరభేరి మోగించింది. పేదల పాదయాత్ర పేరుతో లబ్ధిదారులతో కలిసి మూడు రోజులపాటు ఈ వారంలో పాదయాత్రను నిర్వహించింది. గుత్తి నుంచి అనంతపురం వరకు సాగిన ఈ యాత్రలో అనేక మంది పేదలు పాల్గొన్నారు. ఆఖరి రోజు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాకు వందలాది మంది నిరుపేదలు పాల్గొన్నారు. దీన్ని బట్టి ప్రభుత్వం చెబుతున్న మాటల్లోని డొల్లతనం బహిర్గతమైంది. అనేక సంవత్సరాలుగా ఉంటున్న నిరుపేదలకు ఇళ్లు కాకున్నా కనీసం ఇంటి పట్టా అయినా ఇవ్వాలని ఈ ధర్నాలో డిమాండ్ చేశారు. అనువుగాని చోట స్థలాలు కేటాయించడంతోనే జగనన్న కాలనీల్లో ఇళ్లు కట్టుకోలేకపోతున్నట్టు కూడా సిపిఎం పోరాటం ద్వారా వెల్లడైంది. అనంతపురం నగర శివార్లలోనే కామారుపల్లిలో ఆరు వేల మందికని వేసిన జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణం చేపట్టడం వీలుకాదని సాంకేతిక నిపుణులు తేల్చి చెప్పారు. దీంతో ఇక్కడి పట్టాలను అధికారులు రద్దు చేశారు. కొత్తగా ఇళ్ల స్థలాలు కేటాయించలేదు. ఉరవకొండలో ఇళ్ల స్థలాలు శ్మశానానికి పక్కన కేటాయించడంతో లబ్ధిదారులు అక్కడికెళ్లడానికి వెనుకడుగువేస్తున్నారు. ఇతర లేఅవుట్లలోనూ మౌలికసదుపాయలు కల్పించబడలేదు. సిపిఎం జరిపిన ఇళ్ల స్థలాల పోరాటంతో అధికార యంత్రాంగంలో కదలిక వచ్చింది. జనవరి నాలుగో తేదీన లబ్ధిదారులతో ఇళ్ల స్థలాల వద్ద కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధపడ్డారు. దీంతో మరిన్ని అసలు విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయి. శింగనమలలో కెజిబివి



పాఠశాలలో విద్యార్థినులు రెండవసారి అస్వస్థతకు గురవడం పెద్ద చర్చనీయాంశమైంది. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు దిగువ స్థాయి అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఈ వారంతం ఏడాది చివరి వారం కావడంతో నూతన సంవత్సర వేడుకల కోలాహలం అంతటా కనిపించింది. చివరి రోజు అయిన శనివారం నాడు పెద్దఎత్తున నూతన సంవత్సర వేడుకల సంబరాలు అంభరాన్ని అంటాయి. గతేడాదిలాగా ఈ ఏడాది కోవిడ్ భయాలేవీ లేకపోవడంతో దుకాణాల వద్ద కొత్త బట్టల కొనుగోళ్ల సందడి, బేకరీల వద్ద కేకుల కోసం జనం సందడి కనిపించింది.

ప్రజాసేవలో 'కందికుంట'

ప్రజాశక్తి-కదిరి టౌన్

- ◆ పేదలకు ఆర్థిక సాయం
- ◆ సొంతనిధులతో షాదీమహల్ నిర్మాణం
- ◆ కదిరి రాజకీయాల్లో ప్రత్యేక స్థానం
- ◆ నేడు జన్మదిన వేడుకలు

కదిరి నియోజకవర్గంలో కందికుంట వెంకటప్రసాద్‌కు ప్రత్యేక స్థానం ఉంది. అటు సేవా పరంగానూ, ఇటు రాజకీయంగా ప్రజలకు సేవ చేస్తూ ఆయన ముందుకు సాగుతున్నారు. అధికారం ఉన్నా, లేకున్నా కదిరి నియోజకవర్గం అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తున్నారు. కదిరి నియోజకవర్గ ప్రజల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని ఏర్పాటు చేసుకుని ముందుకు వెళుతున్నారు. కందికుంట వెంకటప్రసాద్ ప్రస్తుతం కదిరి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ప్రతిపక్ష నేతగా ప్రజల సమస్యలపై అనునిత్యం స్పందిస్తున్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ కార్యక్రమాలను నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటూ వారిలో మనోధైర్యాన్ని నింపుతున్నారు. పరిటాల రవీంద్ర ప్రోద్బలంతో తెలుగుదేశం పార్టీలో చేరిన ఈయన రెండు దశాబ్దాలుగా కదిరి నియోజకవర్గం రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకుని ముందుకు సాగుతున్నారు. ఏ గ్రామంలో సమస్య అయినా తనదిగా భావించి ఆయన ప్రజల వద్దకు వెళ్తున్నారు. పేదలకు తనవంతుగా నిరంతరం సహాయక సహకారాలు అందిస్తున్నారు. పేదలకు ఆర్థిక సాయం అందించడంలో ముందుండి మానవత్వం చాటుకుంటున్నారు. ఎన్నికల్లో హడావుడి చేసే నాయకునిగా కాకుండా ప్రజలకు పని చేసే వ్యక్తిగా ఆయన్ను ప్రజలు కొనియాడుతున్నారు. కందికుంట రాజకీయాల్లోకి అడుగు పెట్టిన తొలినాళ్లలో కదిరి నియోజకవర్గంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండేది. ఈ సమయంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు నియోజకవర్గంలో ఎన్నో గ్రామాల్లో బోరుబావులు తవ్వించారు. వివాహాలకు ఆర్థిక సాయం అందించారు. మైనార్టీల పక్షపాతిగా ఉంటూ వారికి అండగా నిలిచారు. తన సొంత నిధులు వెచ్చించి షాదీమహల్ నిర్మించారు. అధికారంలోఉన్నా, ప్రతిపక్షంలో ఉన్న సమస్యలపూ అనునిత్యం తపించే వ్యక్తిగా కందికుంట అని ప్రజలు పేర్కొంటున్నారు.



కందికుంట వెంకటప్రసాద్

నేడు 'కందికుంట' జన్మదిన వేడుకలు

కందికుంట వెంకటప్రసాద్ జన్మదినోత్సవ వేడుకలను జనవరి 1వ తేదీ ఆదివారం నాడు ఘనంగా నిర్వహించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన అభిమానులు ఏర్పాట్లు చేసుకున్నారు. కదిరి పట్టంలో పెద్ద ఎత్తున ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

విశ్వదీపా సేవాసంఘం సేవలు అభినందనీయం



వార్షికోత్సవం సందర్భంగా కేక్‌కట్ చేస్తున్న విశ్వదీపాసేవా సంఘం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

విశ్వదీపా సేవా సంఘం సేవలు అభినందనీయమని కంటి వైద్యనిపుణులు నరసింహులు కొనియాడారు. పట్టణంలోని శాంతినగర్లో విశ్వదీపా సేవా సంఘం 10వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో కేక్ కట్ చేసి వార్షికోత్సవ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహులు మాట్లాడుతూ విశ్వదీపా సేవా సంఘం ఆధ్వర్యంలో కుట్టు శిక్షణ, కంప్యూటర్లపై ఉచితంగా శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. నేత్రదానం కార్యక్రమంలో కూడా సేవలు అందించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వదీపాసేవాసంఘం ఫౌండర్ కోళ్లమొరం చంద్రశేఖర్రెడ్డి, అధ్యక్షుడు మాధవ, కార్యదర్శి టిసి.శేఖర్‌రెడ్డి, సభ్యులు దానంబాబు, ప్రభాకర్‌రెడ్డి, ఖమ్మం మాధవ, ఓబులయ్య, కేశవరెడ్డి, మధునాయుడు, తలారిమాధవ, అక్కులప్ప పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో అనంత జట్టు జయకేతనం

ప్రజాశక్తి-కదిరి టౌన్



విజేతలకు బహుమతులు అందిస్తున్న కదిరి ఎంవిఐ వరప్రసాద్

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో అనంతపురం జట్టు జయకేతనం ఎగురవేసింది. రూరల్ మండలం ఎరుకులవాండ్లపల్లి సమీపంలోని హరీష్ పాఠశాలలో హ్యాండ్‌బాల్ అసోసియేషన్, హరీష్ పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 బాలికల హ్యాండ్ బాల్ టోర్నమెంట్ శనివారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, కర్నూలు జట్లు తలపడగా మొదట మ్యాచ్ టై అయింది. తర్వాత 5 నిమిషాలు జరిగిన మ్యాచ్ లో ఒక గోల్ తేడాతో అనంతపురం జిల్లా జట్టు విజయం సాధించింది. విజేతలకు కదిరి ఎంవిఐ వరప్రసాద్ ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా కదిరి పట్టణంలోని హరీష్ స్కూల్లో మొదటి సారి రాష్ట్ర స్థాయి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంఎస్.కిరణ్, హ్యాండ్‌బాల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ రామాంజనేయులు, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి ముస్తఫా కమాల్ బాషా, సభ్యులు ప్రసన్న కుమార్, ఖాదర్ వలీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్రాభివద్ధి చెందాలంటే టిడిపితోనే సాధ్యమని 10వ వార్డు టిడిపి ఇన్‌ఛార్జి క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్' పేర్కొన్నారు. పట్టణంలోని 10వ వార్డులో శనివారం ఇదేం ఖర్మ మనరాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక, అస్తవ్యస్త పాలనతో అన్నివర్గాల ప్రజలు విసిగిపోయారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. పోతుకుంట బృందావనం కాలనీలో రూరల్ నాయకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 10 వార్డు అధ్యక్షులు బుల్లెట్ బాషా, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలేశ్. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇర్షాద్, నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ ఉపాధ్యక్షుడు వినోద్, జనరల్ సెక్రటరీ హరి, నాయకులు బిల్లే రామకష్ణ, రమేశ్, షహీద్ బాబా పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

చట్టాలను తెలుసుకుంటే ఉపయోగం

సబ్ కలెక్టర్ కార్తీక్

ప్రజాశక్తి-అమరాపురం

ప్రతి ఒక్కరూ చట్టాలను తెలుసుకుని వాటిని సద్వినియోగం చేసుకుంటే ఉపయోగమని పెనుకొండ సబ్ కలెక్టర్ కార్తీక్ సూచించారు. శనివారం నాడు మండల పరిధిలోని హేమావతి దళిత కాలనీలో మానవ హక్కుల దినోత్సవం, చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరునికి హక్కులు ఉంటాయన్నారు. వాటిని గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళితులపై వివక్ష ఉంటే అది చట్టప్రకారం నేరం అన్నారు. ఇందిరమ్మ కాలనీలో మౌలిక సదుపాయాలు, ఇతర ప్రభుత్వ భవనాల నిర్మాణం కోసం ఏర్పాటు చేసిన స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని దీనిని స్వాధీనం చేసుకోవాలని దళితకాలనీవాసులు సబ్‌కలెక్టర్‌కు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సబ్ కలెక్టర్ వారంలోగా సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం సబ్‌కలెక్టర్ గ్రామంలోని సిద్ధేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఛైర్మన్ మంజునాథ్ ఆధ్వర్యంలో ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచి తిప్పేస్వామి, ఎంపీటీసీ ఓంకారస్వామి, తహశీల్దార్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

సచివాలయాలకు కన్వీనర్ల నియామకం విడ్డూరం

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా సచివాలయాలకు అనుసంధానంగా కన్వీనర్లను నియమించడం విడ్డూరంగానూ, అప్రజాస్వామికంగా ఉందని టిడిపి కౌన్సిలర్లు ఆరోపించారు. శనివారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సమావేశం జరిగింది. అధికారులు 25 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ ఆసిఫ్ మాట్లాడుతు జిల్లాలోనే అతి పెద్ద ఆట మైదానం ఎంజిఎం పాఠశాల మైదానం అన్నారు. దీనిని ఇతర కార్యక్రమాలకు ఉపయోగించకుండా అభివృద్ధి చేయాలన్నారు. దీనిపై ఛైర్‌పర్సన్ ఇంద్రజ స్పందిసూతూ ప్రత్యేక నిధులు కేటాయించి అన్ని విధాలా మైదానాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. మరో అంశంపై ఆసిఫ్ మాట్లాడుతూ పట్టణంలోని ఆర్‌పిజిటి రోడ్డులో సుమారు రూ.2కోట్ల విలువజేసే మున్సిపల్ రిజర్వు స్థలం అన్యాక్రాంతం అవుతోందన్నారు. దీనిని పరిరక్షించి, ఇందులో ఉద్యానవనం ఏర్పాటు చేస్తే అందరికీ ఉపయోగం ఉంటుందని సూచించారు. దీనిపై స్పందించిన ఛైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ పురపాలక సంఘ వ్యాప్తంగా ఉన్నా రిజర్వు స్థలాలను గురించి, వాటిని పరిరక్షించాలని టౌన్‌ప్లానింగ్ ఎసిపి ఆనంద కుమార్‌కు ఆదేశించారు. సమావేశం జరుగుతున్న సమయంలో టిడిపి కౌన్సిలర్లు ఛైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించి నిరసన తెలిపారు. సచివాలయాలకు కన్వీనర్లను ఏర్పాటు చేయొద్దని నినదాలు చేశారు. అయినప్పటికీ అజెండాలోని అంశాలపై కనీస చర్చ సైతం లేకుండా నెంబర్లు చదువుతూ అజెండాను ఆమోదించారు. ఈ సందర్భంగా టిడిపి కౌన్సిలర్లు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాజ్యాంగాన్ని ఉల్లఘించి ప్రభుత్వ కార్యలయాలకు అనుసందానంగా కన్వీనర్ల నియామకం చేస్తున్నారని ఇది సరికాదన్నారు. తొలగించిన పింఛన్లను తక్షణం పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో వైస్ ఛైర్మన్ జబీవుల్లా, ఇన్‌ఛార్జి కమిషనర్ హరిబాబుతో పాటు అన్ని విభాగాల అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



ఛైర్‌పర్సన్ పోడియం వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి కౌన్సిలర్లు

కౌన్సిల్ సమావేశంలో టిడిపి కౌన్సిలర్లు

వార్డుల్లో తలెత్తితిరగలేక పోతున్నాం

పురపాలక సంఘంలో ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం వల్ల వార్డుల్లో తాము తలెత్తి తిరగలేక పోతున్నామని అధికార పార్టీ కౌన్సిలర్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ ముందు వాపోయారు. శనివారం ఆమె కౌన్సిలర్లు కలిసి అధికారుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేశారు. 38వ వార్డు కౌన్సిలర్ రాధమ్మ, చంద్రలు వార్డుల్లో నీటి సమస్య పరిష్కారం కోసం గత మూడు సంవత్సరాల నుంచి నరసింహారెడ్డి అనే రైతు తన బోరు బావి నుంచి పురపాలక సంఘానికి నీటి సరఫరా చేస్తున్నారని, అయితే అతనికి ఇంత వరకు బిల్లులు చేయలేదన్నారు. మూడు నెలల క్రితం టిడిపికి చెందిన శ్రీనివాసులులకు చెందిన బోరు బావి నుంచి నీటి సరఫరా చేస్తే అతనికి వెంటనే పూర్తి స్థాయి బిల్లులు చేశారన్నారు. ఇంజినీర్లకు ముడుపులు ఇస్తే వెంటనే బిల్లులు చేస్తారని ఆరోపించారు. సింగిరెడ్డిపల్లిలో పాఠశాల వద్ద పెద్ద గుంత ఏర్పడితే దానిని పూడ్చలని పలు మార్లు ఫిర్యాదు చేసిన పట్టించు కోలేదని, అందులో పడి ఒక వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయన్నారు. దీనిపై ఛైర్‌పర్సన్ డిఈఈ నీరజ, ఎఈ సురేష్‌లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్డుల్లో సమస్యలు పరిష్కరించకుంటే మున్సిపాల్టీ నుంచి వెళ్లి పోవాలని తెలిపారు. కౌన్సిలర్లను సమన్వయం చేసుకుని పట్టణాభివృద్ధికి సహకరించాలని సూచించారు.

పాఠశాల విద్యకు ప్రాధాన్యత : ఎమ్మెల్సీ



ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్

హిందూపురం : రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులకు ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ పేర్కొన్నారు. శనివారం రూరల్ మండలంలోని రాచపల్లి ఎపి రెసిడెన్షియల్ స్కూల్, పట్టణంలోని అంబేద్కర్ మోడల్ స్కూల్ (బ్రిడ్జి స్కూల్)లో 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ మాట్లాడుతూ విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజ, ఎంఇఒ గంగప్ప, కౌన్సిలర్లు రహమత్‌బీ, నామణి, వైసిపి నాయకులు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'మా వార్డుల్లో అభివృద్ధి చేయరా'..? : టిడిపి

ప్రజాశక్తి -పెనుకొండ

తెలుగుదేశం పార్టీ కౌన్సిలర్లు గెలిచిన వార్డుల్లో అభివృద్ధి పనులు చేయకుండా ఛైర్మన్ వివక్ష చూపుతున్నారని, ఇది సరైన పద్ధతి కాదని టిడిపి కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని కౌన్సిల్ హాల్‌లో నగర పంచాయతీ అత్యవసర కౌన్సిల్ సమావేశాన్ని ఛైర్మన్ ఉమర్ ఫరూక్ అధ్యక్షతన నగర పంచాయతీ అత్యవసర సమాశాన్ని కమిషనర్ వంశీకష్ణభార్గవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్ సునీల్, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా అజెండాలోని అంశాలను కౌన్సిల్ సమావేశంలో అధికారులు చదివి వినిపించారు. అనంతరం వైసిపి వార్డు కౌన్సిలర్ రఘునాథరెడ్డి అజెండాలోని అంశాలను ఆమోదిస్తూ తీర్మానించగా, మిగిలిన వార్డు కౌన్సిలర్లు ఏకగ్రీవంగా అజెండాలోని అంశాలకు ఆమోదం తెలిపారు. సమావేశంలో టిడిపి వార్డు కౌన్సిలర్లు శోభన్ సప్తగిరి, గీతా హనుమంతులు మాట్లాడుతూ తమ వార్డుల్లో అభివద్ధిని ఆపేశారన్నారు. సీసీ రోడ్ల, వీధిలైట్లు తదితర సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ఇందుకు స్పందించిన ఛైర్మన్ మాట్లాడుతూ అన్ని వార్డుల్లోనూ అభివృద్ధి పనులను చేస్తున్నామని చెప్పారు. టిడిపి కౌన్సిలర్లు జరిగిన అభివృద్ధిని తామే చూపిస్తామని కావాలంటే వార్డులోకి రావాలని సూచించారు. సమావేశంలో అభివృద్ధి అంశంపై టిడిపి, వైసిపి కౌన్సిలర్ల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అనంతరం కమిషనర్ వంశీకష్ణ భార్గవ్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. కౌన్సిలర్లు ఈ పనులను ముందుకు తీసుకెళ్లేలా చూడాలని కోరారు. ఈ నెలలో జరగనున్న బాబయ్యా స్వామి ఉరుసుకు సంబంధించి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు తయూబ్, సద్దాం, భాస్కర్ నాయక్, బోయ హారతి బాబు, అంజలి శ్రీరాములు, నాగరత్న గణేష్, ఫర్జియా బాను, షాబీనా, లావణ్య, చంద్రకళ, సంజీవమ్మ కో ఆప్షన్ సభ్యులు వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి: ఎమ్మెల్యే



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాడు-నేడు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ సంతరించుకుంటోందని ఎమ్మెల్యే శంకర నారాయణ పేర్కొన్నారు. శనివారం నాడు మండల పరిధిలోని శీరేకోళం, ధనపురం గ్రామాల్లో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు వైసిపిని మరింత మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చేపడుతున్న ప్రహరీ నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీంచి, పనులను త్వరితగతిని పూర్తి చేయించాలని గుత్తేదారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శ్రీరాములు, సర్పంచి నీరగంటి ప్రభాకర్, ఎంపీటీసీ గంగాదేవి రాము, మంజునాథ్ రెడ్డి, ప్రభాకర్, డివి.రమణ పాల్గొన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

కదిరి టౌన్ : ప్రజాశక్తి దినపత్రిక 2023 నూతన క్యాలెండర్‌ను కదిరి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షులు లింగాల లోకేశ్వర్ రెడ్డి, న్యాయవాదులతో కలిసి శనివారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ ప్రజాశక్తి దినపత్రిక కోర్టు కోసం ప్రత్యేకించి ప్రత్యేక క్యాలెండర్ను తీసుకురావడం హర్షణీయం అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అంబటి శివప్రసాద్, కె.నరసింహులు పిసిభైరవ ప్రసాద్, రమేష్, న్యాయవాదుల క్లర్కుల సంఘం అధ్యక్షుడు రాము, కోర్టు అసిస్టెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ స్థాయి విద్య

బత్తలపల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం పని చేస్తోందని ఎంపిపి గుర్రం వనజ, సంజీవపురం, దంపెట్ల సర్పంచులు కమతం వరలక్ష్మి, చల్లా కరుణాకర్ నాయుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగరత్నబాయి, వైసిపి నాయకులు కమతం ఈశ్వరయ్య, బండి వీరనారప్ప, విశ్వనాథగుప్తా, మహేష్, శ్రీలక్ష్మి, కార్యదర్శి భారతితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరం జట్టుకు ఎపిఎల్ క్రికెట్ ట్రోఫీ



టోర్నీలో గెలుపొందిన క్రీడాకారులు

ధర్మవరం టౌన్ : అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన ఏపీఎల్ 2022-23 అండర్-19 క్రికెట్ టోర్నీలో ధర్మవరం జట్టు విజేతగా నిలిచింది. శుక్రవారం నాడు జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో అనంతపురం, ధర్మవరం జట్లు తలపడ్డాయి. ఇందులో ధర్మవరం జట్టు విజయం సాధించింది. ధర్మవరంజట్టు కెప్టెన్ యాసీన్ 84 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. ధర్మవరం జట్టు మొట్టమొదటిసారిగా ఏపీఎల్ క్రికెట్ టోర్నీ విజేతగా నిలడంపై క్రికెట్ అసోషియేషన్ మండల అధ్యక్షులు వడ్డెబాలాజీ, కోచ్ రాజశేఖర్ అభినందించారు.

ఇళ్ల పట్టాలు పంపిణీ

కదిరి టౌన్ : కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ 40 మందికి ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రతి పేదవారికి సొంతింటి కలను సాకారం చేయాలన్న ఉద్దేశంతో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టాను మంజూరు చేసి, గృహాలు నిర్మిస్తామన్నారు. సున్నపుగుట్ట తండా వాసులకు ప్రస్తుతం ఇచ్చిన పట్టాలు ఎంతో విలువ చేస్తాయని చెప్పారు. ప్రస్తుతం ఇచ్చిన పట్టాలకు వారం రోజుల్లోపు గృహ నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మణికంఠ నాయక్, వైస్ ఎంపీపీ ఆదినారాయణ, అర్ఐ మున్వర్, విఅర్ఒ ఇనయతుల్లా, ఎంపీటీసీ పుల్లయ్య, కో ఆప్షన్ అల్లాబక్షు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ వెంకటేష్ నాయక్, మాజీ మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ వెంకటేష్ నాయక్, శ్రీనివాసులు నాయక్, రవినాయక్, నిషార్, బాషా, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు ధరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు : చిలమత్తూరు మండల వ్యాప్తంగా ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ రెడ్డి రమణమ్మ తెలిపారు. ఆంగన్‌వాడీ టీచర్‌కు సంబంధించి కొక్కవాండ్లపల్లి(ఓసి), పాతచామలపల్లి(ఎస్సీ) ఆయా(హెల్పర్) పోస్టలకు దేమకేతేపల్లి(బీసి-డి), నేసేవాండ్లపల్లి(విహెచ్), కాపుచన్నంపల్లి(బిసి-ఎ) అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత ఉన్న అభ్యర్థులు జనవరి 6వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు ఐసిడిఎస్ కార్యాలయంలో ధరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.